## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి

**ఆత్మకూరు:** పట్టణంలోని పాత బస్టాండులో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాతసేవ అనంతరం ప్రత్యేక అలంకరణతోపాటు ఆకుపూజలు నిర్వహించారు. సిందూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహామంగళహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమం



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన పి.వి.ఎ.ప్రసాద్ వారిచే భక్తిసంగీతం కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతిప్రార్థన, వినాయకకౌత్వం, శ్రీశైలంశివమయం, శంభో శివశంకరా, శివతాండవస్తోత్రం, భో..శంభో, అయిగిరి నందిని తదితర గీతాలను మాధవి, అనూష, నారాయణమ్మ, కుమారి, సావిత్రి, సుహాసిని, విజయలక్ష్మి, సుజాత, శ్యామల, అరుణ తదితరులు ఆలపించారు.

### అరుగు నుంచి పడి వ్యక్తి మృతి

**బేతంచెర్ల:** పట్టణంలో ఓ వ్యక్తి అరుగుపై నుంచి పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కుమ్మరి వెంకటేశ్వర్లు(30) నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న స్వామిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఉన్న అరుగుపై పడుకున్నాడు. ప్రమాదవశాత్తు అరుగుపై నుంచి బోర్లాపడి గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. శనివారం ఉదయం కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### రైలు కింద పడి మహిళ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

**ఆదోని సెంట్రల్:** కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన హరిజన చిట్టెమ్మ(38) అనే మహిళ శనివారం ఉదయం 9;45 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద మృతి చెందినట్లు ఆర్పీహెచ్‌సీ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. మృతురాలికి వివాహమై 15 ఏళ్లు అయినా పిల్లలు కలగకపోవడం, గతంలో భర్త హరిజన చిన్న వెంకటేష్‌కు యాక్సిడెంట్ కావడం.. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు



ఆత్మకూరులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు.



పాములపాడులో దైవసందేశం వినిపిస్తున్న మత గురువు సుభాన్



నందికొట్కూరులో..



పాములపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



పగిడ్యాలలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు వెళ్తున్న ముస్లింలు



శివపురంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

**ఆత్మకూరు:** శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే ఈద్గాలు, మసీద్‌ల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ విశిష్టతను మతపెద్దలు తెలియజేశారు.

- **బండి ఆత్మకూరు:** మండలంలో లింగాపురం ఈద్గాహ్ మైదానంలో ఇమామ్ మౌలానా మహ్మద్ అలీ నేతృత్వంలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. అనంతరం దేశానికి శాంతి, సమృద్ధి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- **మహానంది:** మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె, బుక్కాపురం, గోపవరం, మసీదుపురం, నందిపల్లె, సీతారామపురం, గాజులపల్లె ఆర్ఎస్, తమ్మడపల్లె, బొల్లవరం, అబ్బీపురం, అల్లినగరం గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మతపెద్దలు ప్రవక్త బోధనలు వినిపించారు.
- **నందికొట్కూరు:** ఆనందోత్సాహాల మధ్య ముస్లింలు బక్రీద్‌ను జరుపుకున్నారు. బస్టాండ్ సమీపంలోని పొలాల్లో ఉన్న ఈద్గాలో ఉదయం 7గంటలకు, పెద్ద ఈద్గాలో 8 గంటలకు బక్రీద్ నమాజు ప్రారంభమయ్యాయి. ముస్లిం మత పెద్దలు పట్టణ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సంక్షేమానికి దువా చేశారు. హజ్ యాత్రికులు శుభప్రదంగా స్వస్థలాలకు చేరుకోవాలని ప్రార్థించారు. అనంతరం ముస్లింల కుటుంబాలలో ఖుర్బానీల పర్వం మొదలైంది. బక్రీద్ పండుగ ప్రత్యేక అంశమైన ఖుర్బానీలో పలువురు ముస్లింలు పొట్టేళ్ల మాంసాన్ని ఖుర్బానీ కానుకగా బంధుమిత్రులకు, పేదలకు పంచిపెట్టారు.
- **పాములపాడు:** బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గాలు, మసీదులకెళ్లి అల్లాను ప్రార్థించారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేకంగా దువా చదివారు. మత గురువులు బక్రీద్ ఇతివృత్తాన్ని వివరించారు.
- **కొత్తపల్లి:** మండలంలోని ముసలిమడుగు, శివపురం, కొక్కెరంచ, దుద్యాల, ఎదురుపాడు, నందికుంట, కొత్తపల్లి, జీ.వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ముస్లిం శుద్ధి స్నానం చేసుకొని, కొత్త దుస్తులు ధరించి వజూ చేశారు. ఒకరికొకరు ఆలింగనాలు చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలకు చేరుకొని ఖాజీ, మౌల్వీ, మౌలానాలు, ఇమామ్‌లతో కలసి సామూహిక ప్రార్థనలు చేశారు.
- **వెలుగోడు:** పట్టణంలోని ఈద్గాలో మతగురువు ఆధ్వర్యంలో ముస్లింలు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఉస్మానియా ముస్లిం అంజుమాన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మనిషి ప్రవక్త సూచించిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు.
- **పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్(బక్రీద్) వేడుకలను జరుపుకున్నారు. ఉదయం ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, త్యాగం, కరుణ, సహనానికి ప్రతీక బక్రీద్ అంటూ మత పెద్దలు ముస్లింలకు వివరించారు.
- **జూపాడుబంగ్లా:** మండలంలోని తాటిపాడు, తర్తూరు, మండ్లెం, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, భాస్కరాపురం, పోతులపాడు, తంగడంచ, పి.లింగాపురం తదితర గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు.

### ఎరువు ఉపయోగించాలి

**పాములపాడు:** పొలాల్లో ఎరువుగా పశువుల పేడ, పచ్చి రొట్ట ఎరువులు ఉపయోగిస్తే పైరులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని ఇస్కాల, లింగాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు. చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. పంటల మార్పిడితో దిగుబడులు పెరుగుతాయని వివరించారు. పలు పైర్లకు సోకే చీడపీడలు వివరిస్తూ నివారణోపాయాలను తెలియజేశారు. కార్యక్రమాల్లో పరిశోధన కేంద్రం వ్యవసాయాధికారి హేమలత, లింగాల ఉప సర్పంచు రంగస్వామి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నరసింహానాయక్

**ఆత్మకూరు:** ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహానాయక్ డిమాండ్ చేశారు. కురుకుంద గ్రామంలో శనివారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 9 వారాలుగా వ్యవసాయ కూలీలకు వేతనాలు మంజూరు కాలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడం వల్ల కూలీల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసయ్య, వెంకటస్వామి, రమణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి



శ్రీశైల ఆలయంలో పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహారెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహారెడ్డి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు.. మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

## పచ్చని చెట్లు నరికినా పట్టించుకోని అధికారులు



ప్రాతకోట-లక్ష్మాపురం గ్రామాల మధ్య రోడ్డు వెంట నరికేసిన చెట్లు



ముచ్చుమర్రి రోడ్డు పక్కన వేప చెట్టును నరికివేసిన దృశ్యం

**పగిడ్యాల:** మొక్కలు నాటి సంరక్షించాలని ఊదరగొడుతున్న అధికారులు.. రోడ్లకిరువైపులా ఉన్న చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నా కిమ్మనడం లేదు. మండలంలోని ప్రాతకోట, లక్ష్మాపురం, ముచ్చుమర్రి, పగిడ్యాల పరిధిలో చేపట్టిన త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ కోసం కాంట్రాక్టర్ రోడ్డు వెంట స్తంభాలు పాతిస్తున్నాడు. ఈక్రమంలో స్తంభాలకు అడ్డొస్తున్నాయంటూ భారీ వృక్షాలను సైతం మిషన్‌తో కట్ చేయిస్తున్నాడు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరపోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవెన్యూ ప్లాంటేషన్ కింద ఉపాధి సిబ్బంది ముచ్చుమర్రి రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఏపుగా పెరిగాయి. వాటి కొమ్మలను కూడా వదలకుండా కొట్టేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అండర్‌పాస్ వంతెనతో అవస్థలు



అండర్‌పాస్ వంతెన పైకప్పునకు పెచ్చులూడిన దృశ్యం

**పాములపాడు:** మండల కేంద్రంలోని చెలిమిల్ల గ్రామానికి వెళ్లే రహదారిలో నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన వంతెన ఎత్తు తక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 6న ఒక హిటాచీ మిషన్ అండర్‌పాస్ వంతెన కింద వెళ్లగా స్లాబుకు తగిలి పెచ్చులూడింది. శనివారం కూడా మరో హిటాచి మిషన్ వెళ్లగా అదే పరిస్థితి ఎదురైంది. వంతెన పైకప్పునకు రెండో దెబ్బ తగిలింది. వంతెన పైకప్పును తగులుకొని వెళ్లడంతో పొడవునా గీత పడింది. ఇలాగైతే వంతెన నాణ్యతలో లోపమా, అధికారుల ప్లానింగ్‌లో తప్పులున్నట్లా అంటూ ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. కేవలం 6 మీటర్ల ఎత్తు ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయమని, వంతెన నిర్మాణం పనులు ప్రారంభించిన నాటి నుంచి లింగాల, చెలిమిల్ల గ్రామాల రైతులు, ప్రజా సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనలు తెలియజేసినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికై నా వంతెన ఎత్తు పెంచాలని పలువురు కోరుతున్నారు. కాగా అండర్‌పాస్ వంతెనలో ఒక మిషన్ వెళ్లినప్పుడు పైకప్పు తగిలిందని తెలిసినా, ఇంకో మిషన్‌ను తీసుకెళ్లడం తప్పని నేషనల్ హైవే పీడీ పద్మ అన్నారు. అండర్‌పాస్ వంతెన ఎత్తు పెంచడం కుదరదన్నారు. అందుకే సర్వీసు రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## వైభవం.. కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు



పూజలందుకున్న కూర్మనారాయణస్వామి



పల్లకీ సేవలో పాల్గొన్న పీఠాధిపతులు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**ఆస్పరి:** మండలంలోని హలిగేరి సమీపంలోని గుహలో వెలసిన శ్రీ స్వయంభూ కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు నరేష్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి క్షీర, చందనాభిషేకం, నదీ జలాలతో అభిషేకం, శ్రీలక్ష్మీ అష్టోత్తర సహిత, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రావిచెట్టుకు పూజలు, హనుమప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారి చిత్ర పటంతో గిరి ప్రదక్షిణ, పుట్టలకు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పీఠాధిపతులకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గంగావతికి చెందిన మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

**పీఠాధిపతుల ప్రత్యేక పూజలు..**

జయంత్యుత్సవాలకు విద్యాభినవ సుబ్రహ్మణ్య భారతి మహాస్వామి, అవ్యక్తానంద సరస్వతి, శివయోగేంద్ర సరస్వతి స్వామి, జగద్గురు శంకరాచార్య శ్రీవిద్యానృసింహ భారతిస్వామి, పాండు రంగానంద భారతి స్వామి, రుక్మిణీమాత, శివానంద చైతన్య స్వామి, గురు సుబ్రహ్మణ్యం, స్వామి శంకరానందగిరి, సురేంద్ర మహారాజ్, అనంతాంద భారతి స్వామి, రామాంజనేయులు గురుస్వామి, మాడగుల అనిల్‌కుమార్ శర్మ, రామిరెడ్డిగారి అరుణారెడ్డి తదితర పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**డోన్ టౌన్:** బైక్‌ను కారు ఢీకొనడంతో తాత మనవరాలు గాయపడిన ఘటన డోన్ సమీపంలోని యు.కొత్తపల్లె వద్ద శనివారం జరిగింది. మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన పేట పెద్దయ్య తన మనవరాలితో బైక్‌పై వెళ్తున్నాడు. యు.కొత్తపల్లె-ఉంగరానిగుండ్ల మధ్యలోని జాతీయ రహదారిపై హిందూపురం నుంచి కర్నూలుకు వెళుతున్న కారు ఢీకొనడంతో పెద్దయ్యకు తీవ్ర గాయాలు కాగా మనవరాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

**కర్నూలు (టౌన్):** అనాథ శవానికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యహ్యా కర్నూలు సేవా సమితి సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించారు. వివరాలు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో గత నాలుగేళ్లుగా వెంకటేశ్వరరావు (65) అనే అనాథ వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. పెరాలసిస్‌తో వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఆయాసంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు అంత్యక్రియలు చేసేందుకు వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునీల్‌కుమార్, యహ్యా సంస్థ సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చారు. మృతదేహానికి అన్ని తంతులు నిర్వహించి వాహనంలో పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు తరలించి సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. వసతి గృహం సభ్యులు సందీప్‌కుమార్, ప్రభాకర్, కరుణమ్మ, ఇమ్రాన్ హోటల్ యజమాని వాహీద్ పాల్గొన్నారు.

## దాహం.. దాహం!


- మహానందిలో పనిచేయని జలప్రసాద కేంద్రం



పనిచేయని జలప్రసాదం కేంద్రం

**మహానంది:** మహానందిలో భక్తులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దివీస్ ల్యాబొరేటరీస్ వారు ప్రసాదాల కౌంటర్, టీటీడీ కల్యాణమండపం, ఆలయంలోని వెళ్లే చిన్నగేటు వద్ద మూడు జల ప్రసాద కేంద్రాలను ప్రారంభించారు. అయితే చిన్నగేటు వద్ద ఉన్న జలప్రసాద కేంద్రం పనిచేయకపోవడంతో ఇటువైపు వచ్చిన భక్తులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో భక్తులు 20 లీటర్ల మంచినీటి క్యానుకు రూ.40 నుంచి రూ. 50లకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో పక్కనే ఉన్న సాధారణ కుళాయిలో నీళ్లు పట్టుకుని వెళ్లాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జలప్రసాద కేంద్రానికి మరమ్మతులు చేయించి భక్తులకు మినరల్ ఫిల్టర్ నీళ్లు అందించాల్సిన అవసరం ఉంది.

## ఆత్మకూరులో భారీ వర్షం



పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

**ఆత్మకూరు:** మండల పరిధిలోని ఆత్మకూరు, కరివేణ, నల్లకాల్వ, ముష్టపల్లి, కొత్తరామాపురం, క్రిష్ణాపురం, సిద్ధపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. పది రోజుల నుంచి చినుకుజాడ లేక పోవడంతో ఇబ్బందులు పడిన రైతులు ఈ వర్షంతో ఊరట చెందారు. ఇటీవల మండలంలో వేసిన పత్తి, మొక్కజొన్న పంటలు జీవం పోసుకున్నాయి. కాగా మండలంలో 30 శాతానికి పైగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగయ్యాయి.

**మండలంలో మోస్తారు వర్షం**

**కొత్తపల్లి:** మండలంలో శనివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఓ వైపు రైతన్న వర్షం కోసం ఎదురుచూస్తుంటే మరోవైపు చిన్నపాటి వర్షానికే ఆయా గ్రామాలలో రోడ్లపై నీరునిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీలు సరిగాలేక రోడ్లపై నీరు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూరు-సంగమేశ్వరం ప్రధాన రహదారిలో ఎం.లింగాపురం గ్రామంలో రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులతోపాటు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.